

కృష్ణమ్మ ఉరకలు

శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

ఆ క్షణం కెమెరాలో పదిలం

నేడు ఫొటోగ్రఫీ డే

వెయ్యి మాటలు చెప్పలేని భావాన్ని ఒక్క ఫొటో చెబుతుంది. కదిలే కాలంలో చెదరని మధుర స్మృతులకు ప్రతిబింబంగా నిలుస్తుంది. అందమైన ప్రకృతిని ఫ్రేమ్‌లో బంధించినా.. మనసు దోచే మగువను కళ్ల ముందుంచినా.. ఔరా! అనిపించే చిత్రాలను క్లిక్ మనిపించినా.. అది ఒక్క ఫొటోకే సాధ్యం. ఎన్నో జ్ఞాపకాలు, ఇంకెన్నో అనుభూతులు, మరెన్నో మధుర ఘట్టాలను పది కాలాల పాటు పదిలంగా ఉంచుతుంది ఫొటో. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' వివిధ సందర్భాల్లో తీసిన కొన్ని అద్భుతమైన ఫొటోలు మీకోసం..

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్స్, మహబూబ్‌నగర్/వనపర్తి



పడమటి సంధ్యారాగం

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం వద్ద సంధ్యా సమయం



బోటులో షికారు

నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల వద్ద బోటులో పర్యాటకుల విహారం



సేమ్ టు సేమ్

సోమశిల వద్ద నీలి రంగులో కనిపిస్తున్న కృష్ణమ్మ



కొమ్మకొమ్మకో కొంగ

వనపర్తి జిల్లా చెన్నూరు అనంతగిరి చెరువులో మోడువారిన చెట్టుపై వాలిన కొంగలు




పచ్చని చేలో పావురాల వేట

మహబూబ్‌నగర్‌లో వరి తుకంపై ఎగురుతున్న పావురాలు



పల్లెటూరి అందం

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం దొంతికుంట తండాలో తుల్జాభవానీ వేడుకల సందర్భంగా సంప్రదాయ దుస్తుల్లో బియ్యం చెరుగుతున్న యువతి



నే ఆడితే లోకమే ఆడదా..

పురి విప్పిన నెమలి



చెట్టు కొమ్మపై వాలిన పిట్ట



మా బాట పొలం బాట

సోమశిల దారిలో ఎద్దుల బండిపై వెళ్తున్న రైతు, కూలీలు



పడవలో షికారు

పస్పుల ఘాట్ సమీపంలో బోటులో వెళ్తున్న ప్రయాణికులు



శంభో శివ శంభో

వనపర్తి జిల్లా పామాపురం వద్ద ఊకచెట్టి వాగులో శివుడి విగ్రహం



సూర్యోదయం



అందాల సోమశిల

నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల వద్ద ప్రకృతి సోయగం




నీటిలో మెరుపునై..

నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల వద్ద నీటిలో సూర్యుని ప్రతిబింబం



రారా చూసుకుందాం..

సోమశిలలో వీధి కుక్కల ఫైటింగ్



ఇంటికి పోదాం చలో..

సాయం సంధ్య వేళ గూటికి వెళ్తున్న పక్షులు

దాశరథి కవిత్వ కాగడాను అందిపుచ్చుకోవాలి

- ప్రముఖ కవి నందిని సిధారెడ్డి
- మహబూబ్‌నగర్‌లో దాశరథి సాహిత్యం-సమాలోచన కార్యక్రమం



మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 18: సమాజం కోసం దాశరథి వెలిగించిన కవిత్వ కాగడా నిరంతరం వెలుగుతూనే ఉంటుందని, దాన్ని అందిపుచ్చుకొని కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే అసలైన నివాళి అని ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్ నందిని సిధారెడ్డి ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్‌లోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో తెలంగాణ సాహితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహాకవి దాశరథి సాహిత్యం-సమాలోచన కార్యక్రమానికి సిధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలకు మరువలేని అమూల్య తెలుగు సాహిత్యాన్ని దాశరథి ఇచ్చారని కొనియాడారు. అప్పటి నిజాం పాలనకు వ్యతిరేకంగా కలం ఎక్కుపెట్టినందుకు జైల్లో బంధిస్తే అక్కడా.. గోడలపై బొగ్గుతో 'నిజాం పిశాచమా కానరాడు నిన్ను బోలినరాజు ఎన్నడేని' అంటూ నిరసనను ప్రకటించిన దమ్మున్న కవి దాశరథి అని కొనియాడారు. తన జీవితంలో ఎన్ని నిర్బంధాలు ఎదురైనా నిరసన కవిత్వాన్ని వినిపించిన నిఖార్సయిన కవి అని ప్రశంసించారు. తెలంగాణ తల్లి కోటి రతనాల వీణగా కొనియాడిన మొదటి కవి దాశరథేనని అన్నారు. తెలుగు భాషను నిరసించిన నిజాం కాలంలో దానిపై పట్టు సాధించిన గొప్ప కవి అని చెప్పారు. అనంతరం దాశరథి సాహిత్యంపై కవి సమ్మేళనాన్ని యాదయ్య నిర్వహించగా, ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కవులు తమ కవితా గానాన్ని వినిపించారు. గాయని పద్మావతి ఆలపించిన దాశరథి గీతాలు అలరించాయి. ఎంవీఎస్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు సుభాషిణి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ పరిమళ్, వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజేత వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బాదేపల్లి వెంకటయ్య గౌడ్, తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్షుడు ఖాజామైనొద్దీన్, కార్యదర్శి ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులు

- కొత్త రేషన్ కార్డుల కోసం వనపర్తి జిల్లాలో వేలల్లో దరఖాస్తులు
- కార్డుల జారీకి కేబినెట్ ఆమోదంతో ఆశలు



వనపర్తి పట్టణంలోని 8వ నంబర్ రేషన్ దుకాణం

వనపర్తి అర్బన్, ఆగస్టు 18: కొత్త రేషన్ కార్డుల కోసం రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపడంతో కార్డుల కోసం దరఖాస్తు చేసుకొని ఎదురు చూస్తున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. చివరిసారిగా 2018లో కొత్త రేషన్ కార్డులు ఇచ్చారు. 2021 జూలైలో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే కార్డులు ఇచ్చారు. కొత్తగా పెళ్లయిన వారు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా, మరికొందరు తమ పిల్లల పేర్లను కార్డుల్లో చేర్పించేందుకు దరఖాస్తు చేసుకొని మీసేవా, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు సాంకేతిక తప్పిదాలతో కొంత మంది పేర్లు కార్డుల నుంచి తొలగిస్తుండగా, కొత్తగా పేర్ల నమోదు మాత్రం చేపట్టడం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీ, మహిళలకు నగదు అందజేత, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, ఆరోగ్య శ్రీ, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లతో పాటు అనేక పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో కార్డు లేని వారు ఆ పథకాలను పొందలేకపోతున్నారు. ఆరోగ్య సేవలు, ఆయుష్మాన్ కార్డు అందడం లేదు. రేషన్ కార్డు ఉంటే ఎక్కడైనా సరుకులు పొందే వెసులుబాటును పౌరసరఫరాల శాఖ కల్పించింది. దాంతో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం కార్డుల కోసం కళ్లల్లో ఒత్తులు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు.



ఎనిమిది ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం

మాకు వివాహమై ఎనిమిది సంవత్సరాలు అవుతుంది. రేషన్ కార్డుకు రెండుసార్లు దరఖాస్తు చేశా. ఇప్పటి వరకు లేదు. ప్రభుత్వం త్వరగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలి.

- జగన్ యాదవ్, పెద్దమందడి

19వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్

వనపర్తి జిల్లాలో రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు సంబంధించిన దరఖాస్తులే 19 వేలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా పేర్లు ఎంట్రీ చేయాలని, పుట్టిన పిల్లల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేస్తున్నారు. వారితో పటు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 50వేలకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వారంతా ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం ఎప్పుడు వెబ్‌సైట్ ఓపెన్ చేస్తుందా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. కొత్త కార్డుల కోసం మంత్రి వర్గ ఉప సంఘం కేబినెట్‌లో ఆమోదం తెలుపడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 1,57,098 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా కుటుంబ సభ్యుల్లో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ప్రతీ నెల 2,497.609 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

నేడు రాఖీ



అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధాన్ని చాటుతుంది రాఖీ. ఈ పండుగ సందర్భంగా అక్కా చెల్లెళ్లు రాఖీలు కడితే.. అన్నాదమ్ముళ్లు వారికి ప్రేమతో కానుకలు ఇస్తారు. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా మార్కెట్లో వివిధ రకాల రాఖీలు విక్రయానికి ఉంచారు. వివిధ రకాలు, రంగుల్లో అవి ఆకర్షిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 15 రూపాయల నుంచి 250 రూపాయల వరకు రాఖీల ధరలు ఉన్నాయి. రాఖీ షాపులతో పాటు స్వీట్ దుకాణాలు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. ఆడపడుచులు రాకతో ఇళ్లన్నీ సందడిగా మారాయి.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్





కొల్లాపూర్‌లో రాఖీలు కొంటున్న మహిళలు





విక్రయానికి ఉంచిన రాఖీలు, అచ్చంపేటలో రాఖీలు కొంటున్న మహిళలు







మూడు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 18 : అక్రమంగా గుట్టను తవ్వి మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్ సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు నాగర్‌కర్నూల్ రెండవ ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని నర్సాయిపల్లిలో గుట్టను తవ్వి మట్టిని మూడు వాహనాలు, ఒక జేసీబీలో తరలిస్తుండగా వాహనాలను అడ్డుకుని గ్రామస్థులు ఆందోళన చేశారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.





పేకాట రాయుళ్ల అరెస్టు

- రూ.2,40,825 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మహమ్మదాబాద్/గండీడ్, ఆగస్టు 18 : ఏడుగురు పేకాట రాయుళ్లు పట్టుబడ్డారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని కపిలాపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగింది. కపిలాపూర్ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు పేకాట రాయుళ్లతో పాటు రూ.రూ.2,40,825 నగదు, నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

కూరగాయల సాగుపై ఆసక్తి

- భూత్పూర్ మండలంలో తీగ, వల పద్ధతిలో పంటల సాగు
- కూరగాయల సాగుపైనే దృష్టి సారించిన అన్నదాతలు
- అధిక లాభాలు గడిస్తున్న రైతులు



కాకార తీగలను పందిరి

భూత్పూర్, ఆగస్టు 18 : వరి, పత్తి, కంది, ఆముదాలు, జొన్న, మొక్క జొన్న వంటి వాణిజ్య పంటలను రైతులు తగ్గించి మార్కెట్‌లో ప్రతీ రోజు డిమాండ్ ఉండే పంటలను పండిస్తున్నారు. కూరగాయల పంటల సాగు పద్ధతిలో రైతులు సోషల్ మీడియా ద్వారా పంటల సాగును మొబాయిల్ ఫోన్ల ద్వారా తెలుసుకొని కూరగాయలు, పండ్ల తోటలు, పూల సాగు వంటి వాటిపై దృష్టి కేంద్రీకరిస్తు న్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు నూతన పద్ధతులు పాటించి, నాణ్యమైన, తాజా కూరగాయల పంటల సాగుపై దృష్టి పెట్టి, మంచి లాభాలను గడిస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీప మండలం కావడంతో పండించిన కూరగాయలను అరగంటలో మార్కెట్‌కు చేరవేసి తాజా కూరగాయలను వినియోగదారులకు అందిస్తున్నారు. అదే విధంగా ప్రతీ రోజు మండలంలోని ఏదో గ్రామంలో సంత (అంగడి) ఉండడంతో రైతులు ఏ రోజుకారోజు కూరగాయలను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని శేరిపల్లి(హెచ్), హస్నాపూర్, పోతులమడుగు, అన్నాసాగర్, రావులపల్లి, కొత్తమొల్గర, వెల్కిచర్ల, భూత్పూర్, అమిస్తాపూర్, సిద్దాయపల్లి తదితర గ్రామాల్లో కాకర, మిరప, టమాట, బీరకాయలు, చిక్కుడు, చెవలకాలు, ఆనంకాయలు (సోరకాయలు), వంకాలు, ఆకు కూరలు పాలకూర, మెంతికూర, చుక్కకూర, గంగవాయలికూర, తోటకూర, ఉల్లి ఆకులు, వంటి వాటిని రైతులు సాగు చేస్తున్నారు. భూత్పూర్ మండలంలో సుమారు 12వందల ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

వలతో తీగ కూరగాయలతో దిగుబడి

నేను చాలా ఏళ్ల నంది కూరగాయల పంటలను సాగు చేస్తున్నాను. అయితే అప్పుడు పెద్దగా పంటల సాగులో ఏలాంటి మెళ్లకువలు తెలుసుకోవాలి అనే విషయాలు తెలిసేవికావు పెల్ ఫోన్‌లో ఏక్కడ్కెడ ఏలాంటి పంటలు పండిస్తున్నారు ? ఎలా పండిస్తున్నారు. అనే విషయాలు తెలిసిపోతున్నాయి. నాకు కాకర తోటలో పెద్దగా అనుభవం లేదు కాని సెల్ ఫోన్‌లో చూశాను. వల కట్టి కాకార తీగలను పందిరి మాదిరిగా చేస్తే బాగా దిగుబడి వస్తుందని అందుకే ఈ సారి వల తెచ్చి కట్టి కాకర తోటను సాగు చేశాను మంచి కాపు వస్తుంది. చాలా బాగుంది.

- రైతు రాములు, పోతులమడుగు


రైతులు చాలా అభివృద్ధి అయ్యారు

గతంలో మాదిరిగా రైతులు ఎవరి మీద ఆదరాపడకుండా వాళ్లు చాలా అభివృద్ధి అయ్యారు. ముందు చూపుతో పంటలను సాగు చేస్తున్నారు ముఖ్యంగా కూరగాయల సాగులో మెళ్లకువలు పాటించి లాభసాటి వ్యవసాయాన్ని రైతులు పండిస్తున్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉండే మా వ్యవసాయ విస్తరణ అధికారుల సలహాలను, సూచనలను పాటిస్తూన్నారు.

- మురళీధర్, మండల వ్యవసాయాధికారి









అమరచింతలో కొవ్వొత్తులతో ర్యాలీ



అమరచింతలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ , డీవైఎఫ్ఐ నాయకులు

అమరచింత,ఆగస్టు18: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ అమరచింత పట్టణంలో ఆదివారం రాత్రి ఎస్ఎఫ్ఐ డీవైఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనలో తక్షణమే సీబీఐ విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై దేశంలో ఇలాంటి సంఘటనలు అనేక రకాలుగా జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ర్యాలీలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు రాఘవ, చంటి, రాకేష్, రవి, సురేందర్, అవినాష్, మూర్తి, మునిసిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, సీపీఎం నాయకులు ఆర్ఎన్ రమేష్, బి.వెంకటేష్, అజయ్, బుచ్చన్న, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



చిన్న బాలన్న ఫైల్

ఆత్మకూరు, ఆగస్టు 18: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మక్తల్ మండలం చందాపూర్ గ్రామ పరిసర ప్రాంతంలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన దొబ్బలి చిన్న బాలన్న (60) చిన్న కుమార్తె వద్దకు మక్తల్ మండలం పంచలింగాల గ్రామానికి శుక్రవారం వెళ్లాడు. శనివారం మక్తల్ పట్టణంలోని చందాపూర్ వద్ద గుర్తు తెలియని వాహనం బాలన్నను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మక్తల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మక్తల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

- ఆత్మకూరులో విషాద ఛాయలు



చిన్నారి సాయి దీక్షిత

అమరచింత/ఆత్మకూరు, ఆగస్టు 18: శంషాబాద్ ఔటర్ రింగ్‌రోడ్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి సాయి దీక్షిత ఆదివారం ఉదయం తుది శ్వాస వదిలింది. వివరాల్లోకి వెళ్తే ఈ నెల 15వ తేదీన ఆత్మకూరుకు చెందిన రాజేష్ తమ బంధువులతో కలిసి శ్రావణమాసం సందర్భంగా యాదగిరి గుట్ట దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పిల్లర్ నెంబుజుజీ 16 ఎగ్జిట్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాలు పాలై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అందులో చికిత్స పొందుతున్న సాయి దీక్షిత ఆదివారం ఉదయం మృతి చెందింది. సాయి దీక్షిత తండ్రి మల్లికార్జున్ ఎనిమిది సంవత్సరాల క్రితం మృతి చెందగా, తల్లి ఆశా వర్కర్‌గా ఆత్మకూరులో విధులు నిర్వహిస్తుంది. వీరికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు రెండో కూతురు సాయి దీక్షిత మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్నేహితుడి పెళ్లికి వెళ్తూ ..

ఇటిక్యాల, : తోటి స్నేహితుడి పెళ్లికి వెళ్తూ ప్రమాదానికి గురై యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం 44వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లాలోని మహానందిలో తిరుపతి వివాహంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు చెందిన స్నేహితులు ఇర్రి శివకుమార్, కట్ట జనార్దన్, వసంతపు వెంకటేష్, వికాస్ సాయిలతో పాటు గంట పవన్‌కుమార్ కారులో బయలుదేరారు. మార్గమధ్యలో ఆదివారం తెల్లవారుజామున ఇటిక్యాల స్టేజీ వద్ద రోడ్డు పక్కకు కారు నిలిపి శివకుమార్, కట్ట జనార్దన్ ముందు కారు అద్దాలను తుడుస్తుండగా హైదరాబాదు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు కారును వెనుక నుండి ఢీకొనడంతో శివకుమార్, కట్టజనార్దన్ అలియాస్ నవీన్(25)కు బలమైన గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నవీన్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. గంట పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తమిళనాడు రోడ్డు ప్రమాదంలో...



అమృత్‌గౌడ్

మక్తల్ : తమిళనాడులోని కోయంబత్తూర్ ఇషా ఫౌండేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మక్తల్ పట్టణానికి చెందిన యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మక్తల్ పట్టణానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, ధనలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు అమృత్ గౌడ్ మూడు రోజుల క్రితం ఇద్దరు మిత్రులు, తమ్ముడితో కలిసి తమిళనాడు రాష్ట్రానికి విహార యాత్రకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇషా ఫౌండేషన్ శివాలయాన్ని దర్శించుకొని మిగతా ప్రాంతాలను దర్శించుకునేందుకు కొయంబత్తూర్ నుంచి నాగపట్నం హైవేపై పట్టణంలోకి ప్రవేశించే సమయంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో అమృత్ గౌడ్ (22) మృతి చెందగా, కారులో ఉన్న అభిగౌడ్, ఇద్దరు మిత్రులు వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్ గౌడ్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ కొయంబత్తూరుకు తరలివెళ్లారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులు, మిత్రులు నర్సింహౌడ్ వద్దకు వెళ్లి సంతాపం తెలిపారు.

చందాపూర్ సమీపంలో ..



అమృత్‌గౌడ్

అచ్చంపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని చందాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర రాష్ట్రం బీర్ జిల్లా వడ్వాని మండలానికి చెందిన రుక్మిణి (45) తండ్రి విఠల్ ఆదివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం దర్శనానికి వెళుతుండగా చందాపూర్ గ్రామ శివారులో నేషనల్ హైవేలో చెట్టును ఢీకొట్టడంతో చంద్రసాగర్ కాల్వలో బోల్తాపడింది. కారులో ఉన్న 8మందికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వారిని చికిత్స కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రుక్మిణికి తీవ్రగాయాలు కావడంతో ఆమెను నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మరణించిందని ఎస్సై రాము తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి అతివేగమే కారణమని బాధితులు తెలిపినట్లు పేర్కొన్నారు.

రోడ్డు కిందకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

మానవపాడు, ఆగస్టు 18: బైకును తప్పించబోయి అదుపు తప్పిన టీఎస్ ఆర్టీసీ బస్సు రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్ఆర్టీసీ బస్సు కర్నూలులో 20మంది ప్రయాణికులకు ఎక్కించుకొని హైదరాబాద్‌కు బయలుదేరింది. మానవపాడు స్టేజీ సమీపంలో బోరవెల్లి నుంచి మానవపాడు వైపునకు రోడ్డు క్రాస్ చేస్తున్న బైకును తప్పించబోయి సడన్‌గా బ్రేక్ వేయడంతో రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ద్విచక్రవాహనదారుడు సుదర్శన్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై విచారించి కేసు నమోదు చేస్తామని హెడ్ కానిస్టేబుల్ తిప్పన్న తెలిపారు.

రుణమాఫీపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ నాయకుడు, నాగం డిమాండ్

- మంత్రులు తలో దారిగా వ్యవహరిస్తున్నారని విమర్శ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రైతు రుణమాఫీపై తక్షణం శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పాలన కుంటుపడిందని మంత్రులు ఎవరికీ వారే యమునా తీరే అన్న చందంగా తయారయ్యారని ఆయన దుయ్యబట్టారు. ఆదివారం సాయంత్రం నాగర్‌కర్నూల్‌లోని తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15లోగా రెండు లక్షల రూపాయల రుణాలను మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ సర్కార్ 41శాతం రైతులకు కూడా రుణమాఫీ చేకూర్చలేదన్నారు. రాష్ట్రంలో రుణమాఫీకి మొత్తం 31వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని ప్రకటించిన ప్రభుత్వం కేవలం 17వేల కోట్ల రూపాయలకు ఎందుకు పరిమితం చేసిందో బహిరంగం చేయాలన్నారు. రైతు రుణమాఫీపై జనానికి ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి తక్షణం శ్వేత పత్రం ప్రకటించాలన్నారు. జూన్ మాసంలో రైతుల ఖాతాలో వేయాల్సిన రైతుబంధు డబ్బులు ఇంత వరకు రాలేదని, వృద్ధాప్య పింఛన్ ఎందుకు పెంచలేదని ఆయన ప్రశ్నించారు. గ్యారెంటీల పేరిట ప్రజలను మోసగించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న నాగం జనార్దన్‌రెడ్డి అవినీతి సొమ్మును కాంట్రాక్టర్ల దగ్గర నుంచి ఎందుకు కట్టించడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని నాలుగు ప్యాకేజీల్లో ఐదున్నర వేల కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని కాగ్ నివేదిక తప్పు పట్టిన ఆ డబ్బులు గుత్తేదారుల నుంచి రికవరీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తుందో తెలియజేయాలన్నారు. కృష్ణా జలాల్లో రాష్ట్రానికి దక్కాల్సిన వాటా గురించి కూడా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శిం చారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలను, నాయకులను వేధిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన వ్యవహారంలో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని, దీని వల్ల భూమి అమ్మిన వ్యక్తికి న్యాయం చేకూరిందా అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ కక్షలకు తాను వ్యతిరేకమని భూ సమస్యల వ్యవహారాలు ఉత్పన్నమైనప్పుడు ఇరువర్గాలను కూర్చొబెట్టి సరిదిద్ది ఉంటే బాగుండేదని అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. విలేకర్ల సమావేశంలో భారత రాష్ట్ర సమితి జిల్లా నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, బచ్చలకూర లక్ష్మయ్యమాదిగ, సంతోష్, వెంకటేశ్, శంకర్, వనపట్ల రాజు, అహ్మద్, సత్యం, అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ అధ్యక్ష పదవికి ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ఈనెల 23న ఎన్నికలు

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), ఆగస్టు 18 : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) మహబూబ్‌నగర్ ప్రెసిడెంట్ పోస్టుకు సంబంధించి రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ షెడ్యూల్ విడుదల చేసినట్లు సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి టైటస్‌పాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీసీబీ మహబూబ్‌నగర్ ప్రెసిడెంట్ ఎన్నికలకు ఈనెల (ఆగస్టు) 23న బ్యాంక్ ఆవరణలో ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో బ్యాంకుకు సంబంధించి 15 మంది డైరెక్టర్లు ఓటింగ్‌లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ అనంతరం అదేరోజు ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు పరిశీలన, 12 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, మధ్యాహ్నం 2:30 గంటలకు పోటీ చేయు అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహించి, 5:30 గంటలకు ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలను ప్రకటించనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

భారీగా నల్లబెల్లం పట్టివేత

- రూ.12 లక్షల విలుచేసే 2,250 కిలోల నల్లబెల్లం, వాహనం స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు, ఒకరి అరెస్టు, పరారీలో మరొకరు



బిజినేపల్లిలో అదుపులోకి తీసుకున్న నిందితుడు, నల్లబెల్లం తరలిస్తున్న వాహనంతో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

బిజినేపల్లి, ఆగస్టు 18 : నాటుసారా తయారీకి వినియోగించే నల్లబెల్లం సరఫరా చేసే ఇద్దరు వ్యక్తులపై ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి నాగర్‌కర్నూల్ అబ్కారీ స్టేషన్‌లో తదుపరి దర్యాప్తు నిమిత్తం అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ నుంచి చాలా కాలంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి, కొల్లాపూర్ ప్రాంతాలకు నాటుసారాకు వినియోగించే బెల్లం, పటికను పోలీసులకు దొరకకుండా సరఫరా చేస్తున్నారని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించి అరెస్టు చేశారు. మరోవ్యక్తి పరారీలో ఉన్నాడు. మహబూబ్‌నగర్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బిజినేపల్లి మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో కర్నూలు నుంచి బిజినేపల్లి మీదుగా నల్లబెల్లం వాహనం వస్తుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు అంబేడ్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో 30కిలోల చొప్పున 75 బ్యాగులో 2,250కిలోల నల్లబెల్లం, ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ బెల్లం, వాహనంతో కలిపి దాదాపు రూ.12 లక్షల వరకు ఉంటుందన్నారు. బెల్లంతో పాటు రవాణాకు వినియోగించిన వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు నిందితుల్లో పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిర్మలాపూర్‌కు చెందిన పుట్ట శ్రీనివాస్ పట్టుబడగా, మరొకరు తెలకపల్లి మండలంలోని వట్టిపల్లి తండాకు చెందిన ముడావత్ ప్రతాప్ పరారీలో ఉన్నాడు. పరారీలో ఉన్న వ్యక్తిని త్వరలోనే అరెస్టు చేస్తామని నాగర్‌కర్నూల్ అబ్కారీ సీఐ కళ్యాణ్ తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లాన్ని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏఈఎస్ శ్రీనివాస్, సీఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, శారద, ఎస్సై సృజన్‌రావుతో పాటు సిబ్బంది చంద్రయ్య, సూర్యం, మునిందర్, జనార్దన్‌లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల్‌హసన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ విజయ్ భాస్కర్ రెడ్డి అభినందించారు.

పిడుగు పాటుకు గొర్రెలు, మేకలు మృతి



తాటిచల్క వద్ద పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

అమ్రాబాద్, ఆగస్టు 18: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాధవానిపల్లి గ్రామ సమీపంలోని అటవి ప్రాంతంలో (తాటిచల్క)లో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగుపడి 14 గొర్రెలు, 12 మేకలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. మండల పరిధిలోని వంగురోనిపల్లి గ్రామానికి చెందిన బీనమోను బాలయ్యకు చెందిన 14 గొర్రెలు, అదే గ్రామానికి చెందిన జబ్బు తిరుపతయ్యకు చెందిన 6 మేకలు, కుమ్మరోనిపల్లి గ్రామానికి చెందిన మేడమోని నారయ్యకు చెందిన 6 మేకలు పిడుగు పాటుకు గురై మృతి చెందినట్లు బాధితులు విలేకరులకు తెలిపారు. అడవిలో మేత మేయడానికి గొర్రెలు, మేకలు వెళ్లడంతో వర్షం వచ్చిన సమయంలో ఈసంఘటన చోటు చేసుకొందని తమకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



జయలక్ష్మికి గోల్డ్ మెడల్‌ను అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి

గద్వాల అర్బన్, ఆగస్టు 18 : తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీసన్న, సతీష్‌కుమార్ తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అండర్-23 మహిళా విభాగంలో 1800 మీటర్ల పరుగు పందెంలో జయలక్ష్మి గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. అలాగే అండర్-12 విభాగంలో రఘుపతినాయుడు 400 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్, పురుషుల విభాగంలో జావెలిన్‌త్రోలో గణేష్ రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్, అండర్-23 విభాగంలో మహేష్ మూడువేల మీటర్ల ట్రిబుల్ చేంజ్‌లో మూడవ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌ను, అండర్-23 మహిళా విభాగంలో మనాలటాబు అనే మహిళ 1500 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్, ఉషారాణి 1500 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌లను సాధించారని వివరించారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలకు సాధించిడం గర్వకారణమని డీవైఎస్ డాక్టర్ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, కార్యదర్శి నాగేష్‌బాబు, సభ్యులు అంజనేయులు, అశోక్, ఆయా క్రీడాసంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

ఫిర్యాదుదారుడిపైనే కేసు నమోదు

- సెల్ మెసేజ్ చూసి కంగుతిన్న బాధితుడు - నిలదీస్తే పోలీసుల నిర్లక్ష్య సమాధానం

భూత్పూర్(మూసాపేట), ఆగస్టు 18 : ఆర్డర్ ఇచ్చిన చికెన్ ఫ్రై తెచ్చి ఇవ్వలేదు ఎందుకని అడిగిన పాపానికి సదరు వ్యాపారి, వైన్‌షాప్ యజమానులు కలిసి మందుబాబులను చితకబాదారు. మా మీద దాడికి పాల్పడుతున్నారని బాధితుల్లో ఒకరు డయల్ 100కు ఫోన్ చేస్తే ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు బాధితులను, దాడికి పాల్పడ్డ వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి వాహనాలు నడుపుతూ మద్యం తాగారని(డ్రంకెన్ డ్రైవ్) కేసు నమోదు చేశారు. అసలు వాహనాలే నడుపలేదు.. మావద్ద ఎలాంటి వాహనాలు లేకుండానే పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపినట్లు కేసు నమోదు చేయడం.. ఇదెక్కడి న్యాయమని బాధితుడు పాత్రికేయుల ముందు వాపోయాడు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం సంకలమద్ది గ్రామానికి చెందిన జనార్దన్, శేఖర్‌తో పాటు మరో ఇద్దరు కలిసి ఈనెల 17వ తేదీన సాయంత్రం మూసాపేట మండల కేంద్రంలో ఉన్న కార్తీక్ అనే మద్యం షాపులో మద్యం కొనుగోలు చేసుకొని పక్కనే ఉన్న పర్మిట్ రూములో మద్యం తాగుతున్నారు. అంతకుముందు అక్కడే ఉన్న చికెన్‌ఫ్రై షాపులో చికెన్ ఆర్డర్ ఇచ్చారు. అయితే చికెన్ ఆర్డర్ తీసుకున్న సదరు షాపు యజమాని చికెన్ ఇవ్వకుండా జనార్దన్, శేఖర్‌లపై కార్తీక్ మద్యం షాపు యజమానులతో కలిసి దాడికి పాల్పడ్డారు. ఈ విషయంపై బాధితులు జనార్దన్, శేఖర్ 100 నంబరుకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని తెలుసుకున్న మూసాపేట పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన వారిని, బాధితులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. మద్యం తాగినట్లు పోలీసులు నిర్ధారించారు. నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఆదివారం బాధితుల్లో ఒకరైన జనార్దన్ సెల్‌ఫోన్‌కు సమాచారం వచ్చింది. ఖంగు తిన్న బాధితుడు మా దగ్గర ఎలాంటి వాహనాలు లేకున్నా పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేయడం ఏంటంటూ పోలీసులను నిలదీశాడు. అంది అంతే అంటూ పోలీసులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని జనార్దన్ మీడియా ముందు వాపోయాడు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' మూసాపేట ఏఎస్సై జయరాణిని వివరణ కోరగా తాగి న్యూసెన్స్ చేయడం వల్ల జనార్దన్‌పై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశామని తెలిపారు.

బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చోరీ

వడ్డేపల్లి, ఆగస్టు 18 : శాంతినగర్‌లోని వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమ్మ అమ్మవారి విగ్రహం మెడలో ఉన్న పుస్తెలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు పూజారి బ్రహ్మయ్యచారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మవారి మెడలో ఉన్న పుస్తెల విలువ రూ.40 వేలు, రూ.ఐదు వేలు జేసే పూజా సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ విషయం గురించి శాంతినగర్ ఎస్ఐ సంతోష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా దొంగతనం జరిగిన విషయం తెలియదన్నారు. సిబ్బందిని అడిగి తెలుసుకుంటానని ఎస్ఐ తెలిపారు. నాలుగు రోజుల క్రితం జరిగిన దొంగతంపై అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వివాహితది హత్యా...ఆత్మహత్యా ?

- ఐదు రోజులు గడుస్తున్నా గ్రామానికి చేరుకోని మహిళ మృతదేహం

- అలంపూర్ ఆస్పత్రి మార్చురీలో శవం

- దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు



సత్యమ్మ (ఫైల్)

వడ్డేపల్లి, ఆగస్టు 18 : ఐదురోజుల క్రితం గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ గ్రామమైన పైపాడులో వడ్ల సత్యమ్మ(36) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే మహిళ అనుమానాస్పద మృతిపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని ఎటూ తేల్చకపోవడం మృతురాలి తండ్రి, బంధువులు, కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పైపాడు చెందిన వడ్ల సత్యమ్మ, రాఘవేంద్రాచారి దంపతులు. రాఘవేంద్రాచారికి పక్షవాతం రావడంతో రెండేళ్లుగా తుమ్మిళ్లలో చెల్లిలి ఇంటి వద్ద ఉంటున్నాడు. పైపాడులో సత్యమ్మ పిల్లలతో కలిసి నివాసం ఉంటోంది. ఈనెల 15న హాస్టళ్లలో ఉన్న పిల్లలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుని ఇంటికి రాగా తల్లి ఉరి వేసుకుని ఉండటం చూసి హతాశులయ్యారు. కాగా, విషయాన్ని వారు చుట్టుపక్కల వారికి తెలుపగా మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తమ కుమార్తెది హత్య, ఆత్మహత్యనా అనే దానిపై విచారణ జరపాలంటూ మృతురాలి తండ్రి కృష్ణమూర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా వివాహిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆగస్టు 16న అలంపూర్ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ విషయంపై గురువారం మృతురాలి కుమార్తెతో ఎలాంటి అనుమానం లేదని పోలీసులు సంతకం చేయించుకున్నారని తండ్రి పోలీసులతో వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిందే. రాజకీయ నాయకులు జోక్యం వల్లే పోలీసులు కేసును నీరుగారుస్తున్నారని మృతురాలి తండ్రి ఆవేదన చెంది మృతదేహాన్ని అలంపూరు మార్చురీ గదిలోనే ఉంచడంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోందని పలువురు వాపోతున్నారు. కాగా, గ్రామంలో శవాన్ని పూడ్చేందుకు గుంత తీసి ఐదు రోజులు గడుస్తున్నా మృతదేహాన్ని తీసుకురాకపోవడం తో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వివాహితది హత్యనా, ఆత్మహత్యనా అన్న విషయాన్ని ఎటూ తేల్చకపో వడంతో బంధువులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై శాంతినగర్ ఎస్ఐ సంతోష్ వివరణ కోరగా, వివాహిత మృతిపై ఎవరు ఫిర్యాదు ఇచ్చినా కేసు నమోదు చేసి విచారణ చేపట్టి నిందితులకు కఠినంగా శిక్షపడేలా చేస్తాం. పోస్టుమార్టం పూర్తి అయిన మృతదేహాన్ని మార్చురీ గది వద్ద ఉంచడం బాధాకరంగా ఉంది. మృతదేహాన్ని తీసుకుని ఖననం చేసుకోవాలని బంధువులకు తెలిపారు. వివాహిత మృతికి కారణమైన నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

లంగర్‌హౌస్‌లో బాలిక మిస్సింగ్

- పాలమూరు బస్టాండ్‌లో ప్యాసింజర్ ఫోన్ నుంచి కాల్ - పోలీసులు వెళ్లే సరికి కనిపించని బాలిక



శ్వేత

మహబూబ్‌నగర్, ఆగస్టు 18 : నాలుగు రోజుల క్రితం లంగర్‌హౌస్‌లో పదిహేడేళ్ల అమ్మాయి శ్వేత అదృశ్యమైంది. ఈ విషయం పై కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఆదివారం మధ్యాహ్నం పాలమూరు బస్టాండ్‌లో ఆ బాలిక అక్కడే ఉన్న మహిళా ప్యాసింజర్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు ఫోన్ చేసింది. తను ఉన్న ప్రాంతం లోకేషన్‌ను షేర్ చేసింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు వెంటనే లంగర్‌హౌస్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాళ్లు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించి, బాలికను చేరదీయాలని కోరారు. వెంటనే సీఐ ఎజాజుద్దీన్ బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లను బస్టాండ్‌కు పంపించారు. కానీ వారు అక్కడికి చేరుకొనే సరికి బాలిక కన్పించలేదు. ఆమె కోసం బస్టాండ్ అంతా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక ఫోన్ చేసిన నెంబర్‌ను తీసుకుని ప్యాసింజర్‌కు ఫోన్ చేశారు. తన ఫోన్ నుంచి కాల్ చేసిన తరువాత టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉందని, అక్కడికి ఆటోలో వెళ్లాలని పాపకు చెప్పి వెళ్లిపోయినట్లు ఆమె తెలిపారు. కానీ ఆ బాలిక స్టేషన్‌కు చేరుకోలేదు. దీంతో పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పోలీసులు పాలమూరు వాట్సప్ గ్రూప్‌లలో బాలిక ఫొటోలను షేర్ చేసి, ఎవరికైనా కనిపిస్తే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

రెండు చోట్ల కార్లు బోల్తా.. తప్పిన ప్రమాదాలు



ఉండవల్లి క్రాస్ రోడ్డు వద్ద,అలంపూర్ చౌరస్తా ఫ్లై ఓవర్ సమీపంలో దూసుకెళ్లిన కార్లు

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 18: ఉండవల్లి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై రెండు వేర్వేరు చోట్ల కార్లు బోల్తా పడ్డాయి. కానీ ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పులివెందుల నుండి హైదరాబాదు వైపు వెళ్తున్న ఓ కారు ఆదివారం తెల్లవారుజామున అలంపూర్ చౌరస్తా ఫ్లై ఓవర్ సమీపంలో టైరు పగిలిపోయి రోడ్డు కిందకు దూసుకెళ్లి గుంతలోకి ఒరిగి ఆగిపోయింది. కారులో బెలున్లు ఓపెన్ కావడంతో ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. అలాగే హైదరాబాదులోని నాగోల్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఉండవల్లి క్రాస్ రోడ్డు సమీపంలో కుడివైపు ముందర టైరు బ్లాస్ట్ కావడంతో కారు పల్టీలు కొట్టుకుంటూ హైదరాబాదు వైపు వెళ్లేదారిలోకి దూసుకెళ్లింది. సరిగ్గా ఆ సమయంలో ఆ రూట్లో వాహనాలేవి రాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి ముందు కారులో ముగ్గురు మహిళలు, ముగ్గురు పదేళ్లలోపు చిన్నారులు, ఇద్దరు పురుషులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



న్యూ వెంకటేశ్వర కాలనీలో సమస్యలపై చర్చిస్తున్న కాలనీవాసులు

అచ్చంపేటటౌన్, ఆగస్టు 18: వర్షాకాలం కావడంతో కాలనీలో దోమల బెడద అధికంగా ఉండడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని న్యూవెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు జైపాల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని న్యూ వెంకటేశ్వరకాలనీ కాలనీవాసులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై మునిసిపల్ సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ప్రధానంగా కుక్కల బెడద అధికంగా ఉందని చిన్న పిల్లలు ఉన్నందున కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారని, వెంటనే అధికారులు చొరవ చూపాలన్నారు. అదేవిధంగా దోమల నివారణ కోసం కాలనీలో మందులు పిచ్చికారి చేయాలని అధికారులను కోరారు. డ్రైనేజీలు లేకపోవడం వల్ల కాలనీలలో మురుగు నీరు అక్కడక్కడ రోడ్లపై ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కాలనీలలో మునిసిపల్ అధికారులు పర్యటించి సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. కాలనీవాసులు అంజనేయులు, సూర్యం, శ్రీనివాసులు, రమేష్, కుమార్, అరవింద్, చందు, మల్లేష్, సీతరాం, శంకర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలస్వామికి నివాళి



బాలస్వామి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

చారకొండ, ఆగస్టు 18: మండల పరిధిలోని జూపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ మజీ సభ్యుడు బాలస్వామి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, జిల్లా మైనార్టీ నాయకుడు ముస్తఫముజ్జుబాయి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలది బాలరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సంజీవ్‌కుమార్‌యాదవ్, జూపల్లి రాములు యాదవ్, మాజీ ఉపసర్పంచ్ కలమండల జగపతి, కమలాకర్‌రావు, పలువురు నాయకులు బాలస్వామి మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలస్వామి కుటుంబానికి జూపల్లి భాస్కర్‌రావు ఆర్థిక సహాయం రూ.50 వేలు, సంజీవ్‌కుమార్‌యాదవ్ రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ బాలస్వామి మృతి చెందడం ఆయన కుటుంబానికి తీరని లోటని అన్నారు. బాలస్వామి అంతిమయాత్రలో గ్రామస్థులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్‌అహ్మద్

కందనూలు, ఆగస్టు 18 : నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 2025లో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్‌అహ్మద్ కోరారు. ఆదివారం జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఆఫ్‌లైన్‌లో కూడా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. 2025 హజ్ యాత్ర కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు సెప్టెంబరు 9వరకు చేసుకోవాలన్నారు. పాస్‌పోస్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు వంటి సర్టిఫికెట్లు జతపర్చాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుదారులు ఏమన్నా ఉంటే నివృత్తి చేసుకోవడానికి నాగర్‌కర్నూల్ జిల్లాలోని హజ్ సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. హజ్ సొసైటీ ఉపాధ్యక్షుడు అబ్దుల్‌హఖ్, కార్యదర్శి అలహాజ్ ఇబ్రహీం, అమీర్‌అహ్మద్, నయీమ్‌ఖాన్, ఎజాస్, సలీం, తాహేర్‌లతోపాటు జిల్లా ప్రచార కార్యదర్శి నూరుల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కందనూలు, ఆగస్టు 18 : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013-14 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు జ్ఞానం, విద్యాబుద్ధులు, క్రమశిక్షణ నేర్పిన ఉపాధ్యాయులకు ఆత్మీయ సత్కారం చేశారు. పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో అత్యంత క్రమశిక్షణతో జీవితాన్ని జీవించాలని పెద్దలను గౌరవిస్తూ ధర్మయుతమైన ప్రయాణం కొనసాగించాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి సంవత్సరం విద్యార్థులు పాఠశాలను సందర్శించి తల్లి తర్వాత తల్లిగా పాఠశాలను భావించి పే బ్యాక్ టు స్కూల్ అనే భావనతో పాఠశాలకు సహకరించాల్సిందిగా కోరారు. ఉపాధ్యాయులు గుడిపల్లి నిరంజన్, గోవిందరెడ్డి, గాలయ్యగౌడ్, అంజనేయులు, శివకుమార్, శేఖర్, రమేష్, పూర్వ విద్యార్థులు మునీందర్, సందీప్, శివశంకర్, నాగరాజు, సుధాకర్, రామదాసు, హుస్సేన్, మల్లేష్, వెంకటేశ్, నరేష్ రెడ్డి, మౌనిక, గీత, కవిత, నిర్మల, కల్యాణి, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భక్తమార్కండేయ శోభాయాత్ర



కల్వకుర్తిలోని భక్తమార్కండేయ భవనం నుంచి శోభాయాత్రకు వెళుతున్న పద్మశాలి సంఘం సభ్యులు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 18 : కల్వకుర్తి పట్టణంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భక్తమార్కండేయ సేవాసంఘం భవనం నుంచి శోభాయాత్రను నిర్వహించారు. ఉదయం రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని మార్కండేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి మూలవిరాట్‌విగ్రహాన్ని ట్రాక్టర్‌లో అమర్చి పట్టణంలోని ప్రధానవీధులగుండా శోభాయాత్రను నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాగుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మన్న పాండయ్య కోశాధికారి మ్యాకల రాజేందర్, సంఘం సభ్యులు రఘు, నర్సింహ, రమేష్, సురేష్, శ్రీకాంత్, రాజేందర్, ముత్యాలు, జగదీష్ పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కొల్లాపూర్, ఆగస్టు 18 : పాలమూరు యూనివర్సిటీ కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో సోమవారం జరగనున్న నాల్గవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడినట్లు పీజీ సెంటర్ ప్రిన్సిపాల్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మార్క్‌పోలోనియస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా నాల్గవ సెమిస్టర్‌లో ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, ఎం ఎస్‌సీ మ్యాథ్యమ్యాటిక్స్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంబీఏ పరీక్షలు వా యిదా పడ్డాయని మంగళవారం నుంచి యథావిధిగా కొనసాగుతాయని ఆయన కళాశాల విద్యార్థులకు సూచించారు.

సర్దార్ సర్వాయి పాపన్న నేటి తరానికి ఆదర్శం

- కలెక్టర్ బదావత్ సంతోష్,

ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి సందర్భంగా ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నాగర్‌కర్నూల్ పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డిలు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ నాటి పాలకుల అరాచకాలను అణిచి వేసేందుకు పుట్టిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కలెక్టర్ అన్నారు. మహనీయులు ఏ ఒక్క కులం కోసం కాకుండా అందరి కోసం పాటుపడ్డారన్నారు. అన్ని వర్గాల వారు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని, ప్రజాస్వామిక స్ఫూర్తితో పోరాడడం గొప్ప విషయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నను జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పని చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గౌడన్నల రక్షణం కాటమయ్య రక్షణ కోసం కిట్లను ప్రభుత్వం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజా నింజాలీ అఫ్సర్, జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు, సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీరాములు, జిల్లా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, నారాయణగౌడ్, వెంకటయ్యగౌడ్, శివయ్యగౌడ్, సంజీవ్‌గౌడ్, నేతాజీగౌడ్, వీరేందర్‌గౌడ్, హరీష్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ రాష్ట్ర నాయకుడు జెట్టి ధర్మరాజు, గౌడన్నల సంఘం నాయకులు, బీసీ వెల్ఫేర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: నిజాం నిరంకుశత్వంను ఎదురించి పోరాటం చేసి గోల్కొండ కోటపై సామాన్యుడి జెండా ఎగరేసి రాజ్యాధికారం చేపట్టి అట్టడుగు వర్గాల పోరాటాలకు ఆద్యుడిగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రకెక్కినాడని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న జయంతి పురస్కరించుకొని పాపన్న గౌడ్ కాంస్య విగ్రహానికి ఆదివారం ఎమ్మెల్యేతో పాటు మండల గౌడ సంఘం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని పదిమంది సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని కోరారు. అనంతరం సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ నాయినోళ్ల బాల్‌రాజు గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు అంతటి వేణుగోపాల్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు అంతటి రాజేందర్ గౌడ్, వంగ సుదర్శన్ గౌడ్, చంద్రగౌడ్, రాజేందర్ గౌడ్, దామోదర్ గౌడ్, భగవంత్ గౌడ్, గణేష్ గౌడ్, అనిల్ గౌడ్, రమణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రవీందర్ గౌడ్, మల్లేష్ గౌడ్, వంగ రామన్ గౌడ్, వెంకటేష్ గౌడ్, భాస్కర్ గౌడ్, తిరుపతయ్య గౌడ్, శంకర్ గౌడ్‌లు ఉన్నారు.

-కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. మండల అధ్యక్షుడు మిద్దె రాములు, కత్తె ఈశ్వర్, వాల్యానాయక్, విల్సన్, జియాజీ తదితరులు ఉన్నారు.

-బీఎస్పీ ఆధ్వర్యంలో

బీఎస్పీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహానికి జిల్లా ఇన్‌చార్జి అంతటి నాగన్న, జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బోనాసి రాం చందర్, అసెంబ్లీ ఇన్ చార్జి కళ్యాణ్, మండల అధ్యక్షుడు రాంచందర్, మండల నాయకులు రాములు, మల్లేష్, శ్రీను, రమేష్ ఉన్నారు.

● ఊర్కొండ: సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన పోరాట పటిమను స్మరించుకున్నారు. గౌడ మండల సంఘం నాయకులు అరవింద్‌గౌడ్, సంగప్పగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, కొండల్‌గౌడ్, దివాకర్‌గౌడ్, మల్లికార్జున్ గౌడ్, రమేష్‌గౌడ్, జయరాములుగౌడ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కౌండిన్య దళం మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద కౌండిన్యదళం సభ్యులు విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కౌండిన్యదళం మండల ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కవిందర్‌గౌడ్, నాయకులు సాయికుమార్ గౌడ్, ప్రసాద్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, సురేందర్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, ఎల్లగౌడ్, మాసయ్యగౌడ్, లింగస్వామిగౌడ్, శ్రీనుగౌడ్, రామస్వామిగౌడ్, వెంకటస్వామి గౌడ్, సాయినాథ్‌గౌడ్, రమేష్‌గౌడ్, బిచ్చన్నగౌడ్, ధర్మేందర్‌గౌడ్, వెంకట్‌గౌడ్, రవీందర్‌గౌడ్, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయిపాపన్న జీవితం అందరికీ ఆదర్శం



కంటోనిపల్లిలో సర్వాయి పాపన్న విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి

● వెల్దండ : సర్వాయిపాపన్న జీవితం అందరికీ ఆదర్శమని, ప్రతీ ఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని కంటోనిపల్లి, కుప్పగండ్ల గ్రామాల్లో గౌడసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్వాయిపాపన్న విగ్రహాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహనీయుల విగ్రహాలను ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. పీసీబీ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు రామకృష్ణ, బీమయ్యగౌడ్, మదన్‌గౌడ్, బాలస్వామి, విష్ణుగౌడ్ తదితరులు ఉన్నారు.

విగ్రహావిష్కరణలో పాల్గొన్న జైపాల్‌యాదవ్

సర్వాయిపాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వాయిపాపన్న విగ్రహం వద్ద జైపాల్‌యాదవ్ నివాళులర్పించారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, , మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, మాజీ వైఎస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, చల్ల మధుసూదన్‌రెడ్డి, రవిగౌడ్, అశోక్, శ్రీను తదితరులు ఉన్నారు.

బహుజన వీరుడు

కొల్లాపూర్: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను కొల్లాపూర్ పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల సందర్భంగా గౌడ సంఘం నాయకులు కేక్ కట్ చేసి పట్టణ ప్రజలకు పండ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట గౌడ సంఘం ఆధ్వర్యంలో మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మునిసిపల్ కౌన్సిలర్ శ్రీదేవి, గౌడ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గోవిందుగౌడ్, వెంకటస్వామి గౌడ్, ఎల్లగౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలపై జరుగుతున్న మొగల్ రాజు, జమీందార్ల, భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటపై బహుజన జెండాను ఎగురవేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఓ ప్రత్యేక గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని అణగారిన వర్గాలపై దాడులు జరగకుండా పాపన్నగౌడ్ అండగా నిలిచారని సర్వాయి పేట కోటతో మొదలుపెట్టి దాదాపు 25కోటలను తన ఆధీనంలోకి తెచ్చుకున్న వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఆయన వీరత్వం గురించి గౌడ సంఘం నాయకులు పేర్కొన్నారు. సుదర్శన్‌గౌడ్, కుమార్‌గౌడ్, కిరణ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు సురేందర్‌గౌడ్, తమటం వెంకటస్వామిగౌడ్, విజయ్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, నారాయణగౌడ్, స్వాములుగౌడ్, గోపాల్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. బీసీ ఐక్యవేదిక నాయకులు కట్ట శ్రీనివాసులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న గౌడ సంఘం నేతలు

● కల్వకుర్తిటౌన్: మండలంలోని తర్నికల్ గ్రామంలో ఆదివారం సర్దార్‌సర్వాయి పాపన్నగౌడు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసిన పూలమాల వేసి నివాళి అర్పించారు. గౌడసంఘం అభివృద్ధి ప్రభుత్వపరంగా కృషిచేయాలని అన్నారు. గౌడ సంఘానికి తాండ్ర ప్రభాకర్‌రెడ్డి కుమారుడు ఆశాదీప్‌రెడ్డి కాటమయ్య గుడి నిర్మాణం కోసం రూ.లక్ష అందజేసినట్లు గౌడసంఘం నాయకులు తెలిపారు. గ్రామ గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఆదివారం సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను గౌడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గౌడ్ సంఘం నాయకులు తిరుపతయ్య, మల్లయ్య, వెంకటయ్య, సాయినాద్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.



బిజినేపల్లిలోని సర్దార్ సార్వయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి



ఊర్కొండలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

మత మార్పిడిలు చేసే ముఠాలను అరికడుదాం

కొల్లాపూర్, ఆగస్టు 18 : రాష్ట్రంలో మతమార్పిడిలు చేసే ముఠాలను అరికట్టేందుకు బజరంగ్‌దళ్ కార్యకర్తలు హిందు వాదులంతా కదలి రావాలని బజరంగ్‌దళ్ రాష్ట్ర విభాగ్ గోరక్ష సంయోజక్ సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని మాధవస్వామి దేవాలయంలో తెలంగాణ, ఆంధ్రా, రాయలసీమ క్షేత్ర సంయోజక్ కుమారస్వామి ఆధ్వర్యంలో బజరంగ్‌దళ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బజరంగ్‌దళ్ సంయోజక్ అధ్యక్షుడిగా సుంకరి పురేందర్, పట్టణ సంయోజక పులి భరత్, మండల సంయోజక్‌గా ఇటికల రాజుతోపాటు సహసంయోజక్ చెర్లపల్లి రమేష్, కొమ్మ భానుప్రకాశ్, గోరక్షక్‌గా లక్ష్మణ్, మండల గోరక్ష ప్రముఖ్‌గా గుగ్గిల మహేష్, పల్లె మహేష్, విద్యార్థి ప్రముఖ్ శ్రీకాంత్, రక్ష ప్రముఖ్ చాపల వంశీ, సొప్పరి రవికుమార్, సప్త్ సంఘ్ తుపాకుల రమేష్, శ్రీనివాస్, శారీరక్ ప్రముఖ్‌గా గువ్వల పవన్‌లతో కూడిన కమిటీని ఎన్నుకున్నట్లు క్షేత్రసంయోజక్ కుమారస్వామి వెల్లడించారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ తెలంగాణ రాష్ట్ర విభాగ్ గోరక్ష సంయోజక్ సురేష్, పాలమూరు సంయోజక్ గూడెం రమేష్‌లు మాట్లాడారు. బజరంగ్‌దళ్ కార్యకర్తలు అభిలాష్‌గౌడ్, భాను, ప్రశాంత్, అరుణ్, చందు, దేవేందర్, భాస్కర్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



బజరంగ్‌దళ్ కార్యకర్తలతో సమావేశమైన రాష్ట్ర విభాగ్ గోరక్ష సంయోజక్ సురేష్

మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

కల్వకుర్తి, ఆగస్టు 18 : కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత ఎడ్మ కిష్టారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని పలువురు నాయకులు పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో కిష్టారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేద్దామని అభిప్రాయపడ్డారు. పట్టణంలోని వైఆర్ఆర్ కాంప్లెక్స్‌లో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో ఎడ్మ కిష్టారెడ్డి నాల్గవ వర్ధంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పలువురు నాయకులు , అభిమానులు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిష్టారెడ్డి సేవలను నాయకులు ఆయన అభిమానులు కొనియాడారు. కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మునిసిపల్ వైస్ చైర్మన్ షాహెద్, ఎంఈవో సర్దార్‌నాయక్, నాయకులు కొండూరు గోవర్ధన్, సింగం విజయ్‌గౌడ్, ఎముక జంగయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, ఎడ్మ వేణు, రంగారెడ్డి, రాంరెడ్డి, ఐజాక్, వెంకటయ్య యాదవ్, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, రాము, గోపి, గణేష్, కిశోర్, పలువురు నాయకులు కిష్టారెడ్డి, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

● వెల్దండ: మాజీ ఎమ్మెల్యే దివంగత ఎడ్మ కిష్టారెడ్డికి ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఎడ్మ కిష్టారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ వెంకటయ్యగౌడ్, నాయకులు చల్ల మధుసూదన్‌రెడ్డి, అనిల్ కుమార్, రఘురామయ్య, జంగయ్య, శేఖర్, చంద్రమోహన్‌రెడ్డి, లింగం, ఆనందు, రవికుమార్‌గౌడ్, నిరంజన్, బాలస్వామి, శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.



ఎడ్మ కిష్టారెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పలువురు నాయకులు



కిష్టారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భారతీయ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న కట్ట ప్రభాకర్‌రెడ్డి

తెలకపల్లి, ఆగస్టు 18 : భారతీయ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాలమూరు విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ కట్ట ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తెలకపల్లిలోని యోగా భవనంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సంస్థ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో హిందూ సంస్కృతి ఉన్న ఏకైక ప్రాంతమని, దానిని కాపాడుకోవాల్సిన వసరం, బాధ్యత మనందరిపై ఉందన్నారు. సి.బచ్చన్న, పెద్ద ఎత్తున యువకులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పద్మావతమ్మ

కోడేరు, ఆగస్టు 18 : కోడేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అదే కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్ పద్మావతమ్మకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్ ప్రాంతీయ అధికారి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని ఆమె ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. కళాశాలలో పద్మావతమ్మ రాజనీతిశాస్త్రం బోధకురాలుగా పని చేస్తున్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

తిమ్మాజిపేట, ఆగస్టు 18 : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చెవ్వ మాదవులు అన్నారు. మూడవ విడత రుణమాఫీలో భాగంగా రెండు లక్షల మాఫీ చేయడంపై పలు గ్రామాల రైతులు, నాయకులు తిమ్మాజిపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గరకు ఆదివారం చేరుకుని సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. రెండు లక్షల పైబడి ఉన్న రైతుల రుణమాఫీ ఈ నెల 30వరకు చేయడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సినవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవూఫ్, దేవస్వామి, ముబారక్, హర్షవర్ధన్‌రెడ్డి, సత్యంనాయక్, చిలుక ఎల్లారెడ్డి, వెంకటయ్య శ్రీరామ్, చంద్రమౌళి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మను దర్శించుకున్న భక్తులు



నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శనం చేసుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 18 : భక్తుల కొంగుబంగారంగా వెలసిన నాయినోనిపల్లి మైసమ్మ దేవతను భక్తులు దర్శనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లాల నలుమూలల నుంచి ఈ ఆదివారం దాదాపు పదివేల మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం మైసమ్మ దేవతకు టికెట్ల ద్వారా 23వేల రూపాయలు, హుండీ ద్వారా 45వేల 895రూపాయలు మొత్తం రూ.68వేల 895 ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వరశర్మ తెలిపారు.

రుణమాఫి అమలులో ప్రభుత్వం విఫలం

వంగూరు, ఆగస్టు 18, రైతు రుణమాఫీ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు అంకు సురేందర్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతుందని, కానీ 40 శాతం మంది రైతులకు కూడా మాఫీ కాలేదన్నారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని దుయ్యబట్టారు. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు కోరడం కూడా మోసంలో భాగమేనని ఆయన పేర్కొన్నారు. రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని లేనిచో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

సమగ్ర కుల గణన చేపట్టాలి

కల్వకుర్తి, ఆగస్టు 18 : సమగ్ర బీసీ కుల గణన చేపట్టాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతంం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. కల్వకుర్తిలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో సమగ్ర కుల గణన వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్‌తో పార్టీలకీతంగా రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని బీసీ సంఘాల కుల సంఘాల నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశానికి విధిగా అందరూ తమ అమూల్యమైన సలహాలు అందించాలని శ్రీనివాస్‌యాదవ్ కోరారు.

బోనమెత్తిన అచ్చంపేట



బోనమెత్తిన యువతి

అచ్చంపేట టౌన్, ఆగస్టు 18: శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని పాత పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని పాత బజారులోని ప్రతీ ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకొని మహిళలు ఆలయానికి బయలేర్దారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని బోనాలు అమ్మవారికి నైవేదాన్ని అమ్మవారికి సమర్పిస్తారన్నారు. మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.